క్లుప్తంగా

డ్వాక్రా సంఘాల ఆవశ్యకతపై అవగాహన



ర్యాలీలో సీసీలు, మహిళా సంఘాల సభ్యులు

సాలూరు: డ్వాక్రా మహిళా సంఘాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శనివారం సభ్యులు ర్యాలీ, మానవహారం చేపట్టారు. ప్రతీ మహిళ సంఘంలో చేరాలని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి పొందాలని ఏపీఎం జి.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరా



రోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పలనాయుడు

సాలూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు శనివారం సదంర్శించి, అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, సకాలంలో వారికి వైద్యం అందేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం పలు వార్డులకు వెళ్లి, అక్కడి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నిర్మాణ దశలోని వంద పడకల ఆస్పత్రిని పరిశీలించి, పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

• డీఎఫ్ఓ ప్రసూన



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది, ప్రజలు

సాలూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని డీఎఫ్ఓ ప్రసూన అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సులో పాల్గొన్న ఆమె మానవ మనుగడకు అడవులను పరిరక్షించుకోవాలని, ప్రతిఒక్కరూ తమవంతుగా కొన్ని మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. అలాగే కాలుష్యం జరగకుండా చూడాలని, నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని తెలిపారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. అనంతరం పర్యావరణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు రామారావు, గంగరాజు, నారాయణరావు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ ఆదినారాయణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పరీక్షలు జరుగుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో తాగునీరు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల వద్ద స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మంజులా వీణ, మజ్జి సత్యనారాయణ, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

వీరఘట్టం: తమపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధు ల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వానికి తమ సమస్యల ను తెలియజేయాలని ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి, రేగులపాడు కేజీబీవీ ఎస్.ఓ రోహిణి కోరారు. ఈ మేరకు వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కలి సి వినతి పత్రం అందజేశారు. కొద్ది రోజుల కిందట విద్యాశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రేగులపాడు కేజీబీవీని సందర్శించినప్పుడు చోటు చేసుకున్న పరిణామాలపై తమను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారని, అయితే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రేగులపాడు కేజీబీవీ బాలికలు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అందరూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారని ఎమ్మెల్యేకు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తాము ఎంతో కృషి చేశామన్నారు. ఈ ఫలితాలను చూసి తమ సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసేలా చొర వ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే కళావతి సానుకూలంగా స్పందించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సూడిగాం గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఆయన దృష్టికి తీసుకు వచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఆయన తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్ర, సభలు, సమావేశాలు, సదస్సుల్లో ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు అమలు చేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు.

ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటి ని ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాథరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మా చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం

• ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్.ప్రసాద్



సీతానగరం: ఉపాధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్.ప్రసాద్ తెలిపారు. మండలంలోని జోగింపేట, గుచ్చిమి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేసుకోవాలన్నారు. సిబ్బంది కూడా పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామసభల్లో గుర్తించిన అభివృద్ధి పనులకు కూడా ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలన్నారు. ఉపాధి పని కావాలన్న అర్హులందరికీ పని కల్పించాలని తెలిపారు.

డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేత



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న చింతపండు పిక్కతీత కార్మిక సంఘం నాయకులు, సభ్యులు

సాలూరు: స్థానిక పట్టణంలోని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను ఆయన స్వగృహంలో చింతపండు పిక్కతీత కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్.వై.నాయుడు, సంఘ సభ్యులు శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని చింతపండు గొడౌన్‌లలో దాదాపు 350 మంది మహిళా కార్మికులు చింతపండు పిక్కతీత పనులకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

2023 మార్చి ఒప్పందం ప్రకారం కేజీ చింతపండు పిక్కతీతకు రూ.19 చెల్లించేవారని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కేజీ చింతపండు పిక్కతీతకు రూ.24 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై 40 రోజులుగా సమ్మె చేస్తున్నా సంబంధిత యజమానులు పట్టించుకోవడం లేదని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



గడప గడపకు.. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రాజన్నదొర, తదితరులు

• డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: కుల,మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కుంటినవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలోకి తొక్కిన టీడీపీ, జనసేన వంటి పార్టీలు తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజల ముందుకు వస్తాయని, అలాంటి పార్టీలను నమ్మవద్దని సూచించారు.

నాలుగేళ్లలో 17 వేల కాలనీలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల కాలనీలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎన్ని పట్టాలు ఇచ్చారో బహిరంగంగా చెప్పాలని సవాల్ విసిరారు. అలాగే అమరావతిలో 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వస్తే ప్రతిపక్షాలు అడ్డుకోవాలని చూడడం తగదన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రభుత్వ సొమ్మును దోచుకున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేనలకు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రావాడ ఈశ్వరరావు, పారిపిరెడ్డి అరుణ, యాండ్రాపు సింహాచలం, వైకుంఠపు సత్యనారాయణ, పెదిరెడ్ల సూర్యనారాయణ, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్‌నాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, కనిమెరక త్రినాథరావు, తహసీల్దార్ ఆదిబాబు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ఆర్థికసాయం పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం, సాధికారత అధికారి గయాజుద్దీన్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. 35 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. జూన్ 10వ తేదీలోగా హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులంతా క్వాలిఫై అయిన పరీక్షలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎంబీబీఎస్‌కు దరఖాస్తు చేసుకునే వారు నీట్ తప్పనిసరిగా క్వాలిఫై అవ్వాలన్నారు.

వెలగవలసలో 'ఫ్యామిలీ డాక్టర్'



వెలగవలస గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఐశ్వర్య

పార్వతీపురంటౌన్: మండలంలోని వెలగవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైద్యాధికారిణి ఐశ్వర్య శిబిరానికి హాజరైన పలువురికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యసేవలు అందజేశారు. వేసవి నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లకు వందనం'



పార్వతీపురం టౌన్: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పాచిపెంట: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు



మక్కువ: సేవారత్న పురస్కారంతో వలంటీర్ మంగమ్మను సన్మానిస్తున్న దృశ్యం

సాలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లుగా ఎంపికైన వారిని సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులే కాకుండా సంక్షేమ రథసారథులు కూడా అన్నారు. ఎంతో బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తుందన్నందుకు తన అభినందనలన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా బాగా పనిచేసి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. మండలంలోని 22 సచివాలయాల పరిధిలో సేవావజ్రకు ఇద్దరు, సేవారత్నకు ఐదుగురు, సేవామిత్రకు 189 మంది ఎంపికయ్యారని వారికి వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు పురస్కారం అందిస్తున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జర్జాపు మోహన్, కిలపర్తి మన్మథరావు, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని గొట్టూరు, మూటకూడు, కె.రంగిరాయిగుడ్డివలస గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ జన్ని ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉత్తమ గ్రామ సచివాలయ వలంటీర్లుగా ఎంపికైన వారికి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు, సర్పంచ్‌లు, మాజీ వైస్ ఎంపీపీ గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని కాశీపట్నంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో చప్పబుచ్చింపేట, ఎ.వెంకంపేట, వెంకటభైరిపురం, కాశీపట్నం సచివాలయ పరిధిలోని ఉత్తమ గ్రామ వలంటీర్లను జెడ్పీటీసీ సభ్యులు మావుడి శ్రీనివాసరావు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో శనివారం సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ దేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉత్తమ గ్రామ సచివాలయాల వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకే సంక్షేమ పథకాలు అందించే ఉద్దేశ్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని, ఆయన నమ్మకం వమ్ము చేయకుండా పనిచేసిన మీకు అభినందనలన్నారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ మరడాన భాగ్యశ్రీ, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్ బోను రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పిల్లలను చక్కగా చదివించండి



విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సీతానగరం: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమని, పిల్లలు ఇంటివద్ద చక్కగా చదువుకునే వాతావరణ కల్పించాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ కోరారు. సీతానగరం ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు హెచ్ఎం ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రత్యేక తరగతులకు విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. హాజరుకాని విద్యార్థుల వివరాలు తెలుసుకుని వారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఏమి పాఠాలు చెప్పారో పిల్లలను అడిగి తెలుసుకుని చదివించాలన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో 'నో యాక్సిడెంట్ డే'



ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, సిబ్బంది కలిసి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు ధరించాలన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలోకి ఎక్కించవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజారావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కొద్దు

గుమ్మలక్ష్మీపురం: సైబర్ నేరగాళ్లు పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తామని చెప్పి కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని పెన్షనర్ల సంఘం మండల నాయకులు బగ్గం బాబ్జీప్రసాద్, గుడ్ల హరిప్రసాద్, జగన్నాథ రథో శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల వద్ద అపాయింట్‌మెంట్ తేదీ, పదవీ విరమణ తేదీ, పీపీఓ నంబర్, ఆధార్ కార్డ్ నంబర్, శాశ్వత చిరునామా, ఇమెయిల్ ఐడీ వంటి ప్రాథమిక వివరాలు ఉంటాయని, ఈ మొత్తం డేటాతో కాల్ చేసి మాయమాటలు చెప్పి నమ్మిస్తారని, ఓటీపీ సేర్ చేయమని అడుగుతారని, ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ మాత్రం వారికి తెలియ చేయొద్దని సూచించారు. లైఫ్ సర్టిఫికెట్ కోసం పెన్షన్ డైరెక్టరేట్ నుంచి ఓటీపీ చెప్పమని ఎప్పుడూ కాల్ చేయరని, ఈ విషయాన్ని పెన్షనర్లు గ్రహించా లని కోరారు.

కార్మికుల ఆరోగ్య భద్రతకు చర్యలు

పాలకొండ: రాష్ట్రంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ప్రతీ పరిశ్రమలో, కర్మాగారంలో, నిర్మాణ రంగ సంస్థల యజమానులు తగు జాగ్రత్తలతో కూడిన చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కిరణ్‌చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పని వేళలను ఉదయం, సాయంత్రంకు మార్పులు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు. కార్మికులకు పీస్ రేటు ధరలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో మంచినీరుతో పాటు, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సీతానగరం: ఈదురుగాలుల బీభత్సానికి మండలంలో పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశారు. ఏఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు.